# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

VC NEWS

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ మంగళవారం 28 మే 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:01 సంచిక: 322

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD





ప్రశాంతంగా ముగిసిన పట్టభద్రుల ఉప ఎన్నికల పోలింగ్

# ధూమ్‌ధామ్‌గా
## తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు

**ట్యాంక్‌బండ్‌పై వినూత్నరీతిలో కార్నివాల్**

**ఫుడ్‌కోర్టులు, లేజర్ షోలు..హస్తకళా ప్రదర్శనలు**

**అధికారులకు ఆదేశాలు ఇచ్చిన సిఎస్ శాంతికుమారి**



హైదరాబాద్: తెలంగాణ దశాబ్ది అవతరణోత్సవాలను ధూమ్ ధామ్‌గా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు భారీగా ఏర్పాట్లు చేయబోతున్నారు. జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. జూన్ 2న ఉదయం గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ రాష్ట్ర సాధన అమరవీరులకు సీఎం రేవంత్ రెడ్డి నివాళులు అర్పించనున్నారని, అనంతరం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారని వెల్లడించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ ఏర్పాట్లపై డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో వివిధ శాఖల కార్యదర్శులు, ఉన్నతాధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. డీజీపీ రవిగుప్తా, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు దాన కిషోర్, శైలజా రామయ్యర్, శ్రీనివాస రాజు, జీఏడీ కార్యదర్శి రఘునందన్ రావు తదితర అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. పరేడ్ గ్రౌండ్‌లో జూన్ 2న ఉదయం రాష్ట్ర గీతాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించడంతో పాటు ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నట్లు పేర్కొన్నారు. ట్యాంక్ బండ్‌పై సాయంత్రం 7గంటల నుంచి రాత్రి 9గంటల వరకు రాష్ట్రంలోని అన్ని కళారూపాలతో పెద్దఎత్తున కార్నివాల్ నిర్వహించనున్నట్లు సీఎస్ వివరించారు. శిక్షణ పొందుతున్న 5000మంది పోలీస్ అధికారులు బ్యాండ్ ప్రదర్శన ఇవ్వనున్నారని చెప్పారు. ట్యాంక్ బండ్‌పై దాదాపు 80స్టాళ్లను ఏర్పాటు చేసి హస్త కళలు, చేనేత, స్వయం సహాయక బృందాలు తయారు చేసిన పలు వస్తువులలతోపాటు నగరంలోని పేరొందిన హోటళ్లచే ఫుడ్‌స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

# ఎపిలోనూ ఎన్‌డిఎ పాలన ఏర్పాటు





**వచ్చేది మళ్లీ మోడీ ప్రభుత్వమే**

**ఎండాకాలం ఎన్నికలకు ఇక ముగింపు పలుకుతాం**

**జమిలి ఎన్నికలతో వరుస ఎన్నికలకు స్వస్తి**

**కేంద్రహోంమంత్రి అమిత్ షా స్పష్టీకరణ**



# రాష్ట్ర చిహ్నంలో మార్పులపై చర్చ

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అధికారిక చిహ్నంలో మార్పులు, చేర్పులపై ప్రముఖ చిత్రకారుడు రుద్ర రాజేశం బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సోమవారం చిత్రకారులతో ఆయన భేటీ అయ్యారు. ప్రస్తుత అధికారిక చిహ్నంలో రాచరికపు గుర్తులు ఉన్నాయంటూ కాంగ్రెస్ ప్రభుత్వ తొలి క్యాబినెట్ సమావేశంలో అభ్యంతరం వ్యక్తమైంది. ప్రజాస్వామ్యం, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని ప్రతిబింబించేలా చిహ్నాన్ని రూపొందించాలని అప్పుడే నిర్ణయించారు. అందులో భాగంగానే చిత్రకారుల బృందంతో జరిగిన సమావేశంలో సీఎం రేవంత్‌కు 12 నమూనాలను చూపించారు. వీటిపైచర్చించిన సీఎం తుది నమూనాపై పలు సూచనలు చేశారు.


తెలంగాణ రాష్ట్ర అధికారిక చిహ్నంలో మార్పులు, చేర్పులపై ప్రముఖ చిత్రకారుడు రుద్ర రాజేశం బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సోమవారం చిత్రకారులతో ఆయన భేటీ అయ్యారు.


# ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ముగింపు ఉత్సవాలు

## మూడు రోజులపాటు నిర్వహించాలని బీఆర్ఎస్ శ్రేణులకు కేసీఆర్ ఆదేశం



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 'తెలంగాణ దశాబ్ది ముగింపు వేడుకలు'ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. ఇందులో భాగంగా జూన్ 1 నుంచి మూడు రోజులపాటు బీఆర్ఎస్ అధ్వర్యంలో ఘనంగా వేడుకలు జరపాలని ఆదేశించారు. 14 ఏళ్లు పోరాడి తెలంగాణను సాధించి, స్వరాష్ట్రంలో తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి దశాబ్దకాలంపాటు తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపిన ఘనత బీఆర్ఎస్ పార్టీ, ప్రభుత్వానిదేనని కేసీఆర్ పునరుద్ఘాటించారు ఈ చారిత్రక సందర్భంలో దశాబ్ది ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ సూచనలను అనుసరించి గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి దాకా వేడుకల్లో పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కేసీఆర్ పార్టీ కార్యకర్తలను, నేతలను కోరారు. ముగింపు ఉత్సవాలు ఇలా: జూన్ 1న సాయంత్రం 7 గంటలకు గన్‌పార్క్ అమరవీరుల స్థూపం నుంచి ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న అమర జ్యోతి వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాధనలో ప్రాణాలఅర్పించిన అమరులకు పుష్పాంజలి ఘటించి నివాళి అర్పిస్తారు. జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ రోజున హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేసీఆర్ అధ్యక్షతన సభ నిర్వహిస్తారు.ఇదే రోజు హైదరాబాద్‌లోని పలు దవాఖానాల్లో, అనాథ శరణాలయాల్లో పార్టీ ఆధ్వర్యంలో పండ్లు, మిఠాయిలు పంపిణీ చేస్తారు. జూన్ 3న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని పార్టీ కార్యాలయాల్లో ముగింపు వేడుకలు నిర్వహిస్తా రు. ఈ సందర్భంగా పార్టీ జెండాను, జాతీయ జెండాను ఎగురవేస్తారు. జిల్లా ల్లోని దవాఖానాల్లో, అనాథ శరణాలయాల్లో స్వీట్లు, పండ్లు పంపిణీ చేస్తారు.

# బెంగుళూరు డ్రగ్స్ కేస్‌లో మరో ట్విస్ట్

**జ్వరంతో విచారణకు రావడం లేదన్న నటి హేమ**



హైదరాబాద్: బెంగుళూరు డ్రగ్స్ కేస్‌లో మరో ట్విస్ట్ చోటు చేసుకుంది. పోలీసుల విచారణకు నటి హేమ దుమ్మా కొట్టారు. విచారణ కు హాజరయ్యేందుకు సమయం కావాలని హేమ కోరినట్టుగా తెలుస్తోంది. తాను వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నానని బెంగుళూరు సీసీబీకి హేమ లేఖ రాసింది. హేమ లేఖను సీసీబీ పరిగణలోకి తీసుకుంది. హేమకు మరో నోటీస్ ఇచ్చేందుకు బెంగుళూరు పోలీసులు సిద్ధమయ్యారు.బెంగుళూరు రేవ్ పార్టీ కేసుకు సంబంధించి విచారణ కొనసాగుతోంది. ఈ రేవ్ పార్టీలో డ్రగ్స్ తీసుకున్న 8 మందికి సీసీబీ నోటీసులు జారీ చేసింది. వారంతా బెంగళూరు సీసీబీ ఎదుట హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొంది. నోటీసులు అందుకున్న వారిలో నటి హేమ కూడా ఉంది. ఈ రేవ్ పార్టీలో పాల్గొన్న తెలుగు వారందరికీ పాజిటివ్ అని తేలింది. వీరిలో నటి హేమతో పాటు ఆషీరాయ్, పార్టీనిర్వహించిన వాసుతో పాటు పలువురు ఉన్నారు. అయితే హేమ మాత్రం తాను రేవ్ పార్టీలో లేనంటూ బుకాయించింది.

హైదరాబాద్‌లోని ఓ ఫామ్ హౌస్‌లో ఉన్నానంటూ వీడియో రిలీజ్ చేసింది. కట్ చేస్తే బెంగుళూరు పోలీసులు హేమ ఫోటోను రిలీజ్ చేశారు. అంతే సీన్ మాత్రం రివర్స్. హేమ ఈ పార్టీకి తన పేరుతో కాకుండా కృష్ణవేణి అనే పేరుతో హాజరైంది. పోలీసు రికార్డుల్లోనూ హేమ పేరు కృష్ణవేణిగా నమోదు చేయడం జరిగింది.

# ఏపీలో వేర్వేరు చోట్ల రోడ్డు ప్రమాదాలు..

**ఎనిమిది మంది మృతి**

**ఆంధ్రప్రదేశ్‌లో వేర్వేరు ప్రాంతాల్లో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిది మంది మృతి చెందారు.**

చంద్రగిరి: ఆంధ్రప్రదేశ్‌లో వేర్వేరు ప్రాంతాల్లో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిది మంది మృతి చెందారు. పలువురు గాయపడ్డారు. తిరుపతి జిల్లాలో సోమవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చంద్రగిరి మండలం ఎం.కొంగరవారిపల్లి వద్ద పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందారు.ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. నెల్లూరు నుంచి వేలూరుకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ ప్రమాదంలో నెల్లూరు జిల్లా ఇందుకూరు మండలం నరసాపురం గ్రామానికి చెందిన శేషయ్య, ఆయన భార్య జయంతి, వారి బంధువు పద్మమ్మతోపాటు కారు డ్రైవర్ సమీర్ మృతి చెందారు.కృష్ణా జిల్లా బాపులపాడు మండలంలో చోటుచేసుకున్న మరో ఘటనలో నలుగురు మృతి చెందారు. చెన్నై- కోల్‌కతా జాతీయ రహదారిపై కొవ్వూరు నుంచి తమిళనాడు వెళ్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని అవతలి వైపు వెళ్తున్న లారీపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కార్లో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులను స్వామినాథన్ (35), రాకేశ్ (12), రాధా ప్రియా (14), గోపి(31)గా గుర్తించారు. తీవ్ర గాయాలైన మరొకరిని విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మరో ఘటనలో కారు దగ్ధం..

చంద్రగిరి మండల పరిధిలోని సి.మల్లవరం జాతీయ రహదారిపై మరో ప్రమాదం చోటుచేసుకుంది. కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని అవతలి వైపు రోడ్డుకు దూసుకెళ్లింది. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో వాహనం పూర్తిగా దగ్ధమైంది. కారులోని ఇద్దరు ప్రయాణికులు అప్రమత్తమై వెంటనే బయటకు రావడంతో ప్రాణాపాయం తప్పింది. ఇద్దరికీ స్వల్ప గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. తిరుపతి నుంచి చంద్రగిరి వైపు వెళు ్తండగా ఈ ఘటన చోటుచేసుకుంది.



# బెయిల్ వారం రోజులు పొడిగించండి సుప్రీంను అభ్యర్థించిన కేజ్రీవాల్

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలనేపథ్యంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కేజ్రీవాల్ తన మధ్యంతర బెయిల్‌ను 7 రోజులు పొడిగించాలని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే అరవింద్ కేజ్రీవాల్ అనారోగ్యంతో బాధపడుతున్నారని అందుకే పొడిగించాలని చెప్పారు. తనను అరెస్ట్ చేసిన తర్వాత బరువు 7 కిలోలు తగ్గానని పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం తనకు తీవ్రమైన వ్యాధి లక్షణాలు ఉన్నాయన్నారు. అందుకే తాను పీఈటీ-సీటీ స్కాన్ సహా పలు పరీక్షలు చేయించుకోవాల్సి ఉందన్నారు. ఈ క్రమంలో టెస్టులు చేయించుకోవడానికి మరో 7 రోజులు గడువు కావాలని సుప్రీంకోర్టును కోరారు. అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో మధ్యంతర బెయిల్‌పై బయట ఉన్నారు. సుప్రీంకోర్టు జూన్ 1 వరకు ఆయనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. జూన్ 2న కేజ్రీవాల్ లొంగిపోవాల్సి ఉంది. లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం మాత్రమేఅరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో అరవింద్ కేజ్రీవాల్‌ను మార్చి 21న ఈడీ(ఇఞ) అరెస్టు చేసింది. అప్పటి నుంచి ఆయన జ్యుడీషియల్ కస్టడీలో తీహార్ జైలులో ఉన్నారు. ÷దాదాపు 51 రోజుల తర్వాత అరవింద్ కేజ్రీవాల్ జైలు నుంచి బయటకు వచ్చారు. సుప్రీంకోర్టు అయనకు 21 రోజులు మాత్రమే రిలీఫ్ ఇచ్చింది. సుప్రీంకోర్టులో జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం ఈ నిర్ణయం తీసుకుంది. ఢిల్లీ ప్రభుత్వం 2021-22కి సంబంధించిన లిక్కర్ పాలసీని రూపొందించి అమలు చేయడంలో అవినీతి, మనీలాండరింగ్ జరిగిందని ఈ కేసులో ఆరోపణలున్నాయి.

# ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రారంభం

**పోలింగ్ కేంద్రాల్లో బారులుతీరిన గ్రాడ్యుయేట్లు**

**సూర్యాపేటలో ఓటేసిన ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి**



**వరంగల్:** వరంగల్-ఖమ్మం- నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు పోలింగ్ ఉదయం 8 గంటలకే ప్రారంభమైంది. అన్ని చోట్ల ఎలాంటి సమస్యలూ లేకుండా పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోంది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ కొనసాగనుంది. జిల్లా వ్యాప్తంగా 118 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నిక బరిలో 52 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఖఖమ్మం నగరంలో 57 పోలింగ్ కేంద్రాలున్నాయి. బ్యాలెట్ పద్ధతిలో ఎమ్మెల్సీ ఎన్నిక ప్రారంభం అయ్యింది. పోలింగ్ కోసం 129 బ్యాలెట్ బాక్సులను అధికారులు ఏర్పాటు
చేశారు. సీసీ కెమెరాలు, వెబ్ కాస్టింగ్‌తో పోలింగ్ పక్రియ నిర్వహిస్తున్నారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులు నల్గొండలోని స్ట్రాంగ్ రూంకు తరలింపునకు అధికారులు ఏర్నాట్లు చేసారు. 12 జిల్లాల్లో ఈ పోలింగ్ కొనసాగుతోంది. బ్యాలెట్ ద్వారా పట్టభద్రుల ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. మొత్తం ఓటర్లు 4,63,839, 605 కాగా.. పోలింగ్ కేంద్రాలు, 807 బ్యాలెట్ బాక్సులున్నాయి. పురుష ఓటర్లు...2 లక్షల 88 వేల 189 మంది, మహిళలు లక్ష 75 వేల 645 మంది, ఇతరులు ఐదుగురు ఉన్నారు.

'ఖమ్మం ? నల్లగొండ ? వరంగల్' పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఉప ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతున్నది. ఓటర్లు పోలింగ్ కేంద్రాల దగ్గర బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించు కుంటున్నారు. ఈ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో పోలైన ఓట్లను జూన్ 5న లెక్కించనున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. దాంతో ఆ నియోజకవర్గానికి ఉప ఎన్నిక నిర్వహిస్తున్నారు. బరిలో అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా రాకేశ్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థిగా ప్రేమేందర్ రెడ్డి పోటీపడుతున్నారు. ఖమ్మం, నల్లగొండ, వరంగల్ ఉమ్మడి జిల్లాల్లోని మొత్తం 34 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని గ్రాడ్యుయేట్స్ ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కోసం అధికారులు మొత్తం 605 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నియోజకవర్గ పరిధిలోని 4,63,839 మంది అభ్యర్థులు ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇదిలావుంటే బీఆర్ఎస్ సీనియర్ నేత, రాష్ట్ర మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. సూర్యాపేట

ప్రభుత్వ జూనియర్ కాలేజీలోని 457 నెంబర్ పోలింగ్ బూత్‌లో ఆయన తొలి ఓటు వేశారు. ఈ పోలింగ్ బూత్ పరిధిలో మొత్తం 673 మంది ఓటర్లు ఉండగా.. పోలింగ్ ప్రారంభానికి ముందే బూత్‌కు వచ్చిన జగదీశ్ రెడ్డి తొలి ఓటు వేశారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్ సాయంత్రం 4 గంటల వరకు కొనసాగనుంది. ఈ ఎన్నికల్లో పోలైన ఓట్లను లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు మరుసటి రోజైన జూన్ 5న లెక్కించనున్నారు.

# బంగ్లాలో తీరం దాటిని రీమాల్ తుఫాన్

**ఈదురుగాలులతో బంగ్లాదేశ్ అతలాకుతలం**

**తెలుగు రాష్ట్రాల్లోనూ విపరీతంగా ఈదురుగాల వర్షం**

**మొత్తం 15మంది చనిపోయి ఉంటారని అంచనా**



కోల్‌కతా/విశాఖపట్టణం: తీవ్ర తుఫానుగా బలపడిన 'రెమాల్' పశ్చిమబెంగాల్‌లోని సాగర్ ఐలాండ్స్, బంగ్లాదేశ్‌లోని మంగ్లా పోర్టు సమీపంలోని ఖేపుపుర మధ్య ఆదివారం అర్ధరాత్రి సమయంలో తీరం దాటుతుందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) అంచనా వేసింది. తీరం దాటే సమయంలో గంటలకు 120-135 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. మరోవైపు రెమాల్ ఆదివారం రాత్రి బంగ్లాదేశాన్ని తీరాన్ని తాకిందని, బెంగాల్ తీరాన్ని దాటే పక్రియను ప్రారంభించిందని అక్కడి అధికారులు వెల్లడించారు. స్థానిక కాలమానం ప్రకారం అర్ధరాత్రి 12.00-1.00 మధ్య తీరాన్ని దాటిందని, ఆ తర్వాత రెమాల్ తుఫాన్ బలహీనపడుతుందని తెలిపారు. పశ్చిమబెంగాల్ తీర ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. లక్ష మందికి పైగా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కోల్‌కతా ఎయిర్‌పోర్టు అధికారులు ఆదివారం మధ్యాహ్నం నుంచి 21 గంటల పాటు విమాన సర్వీసులను రద్దు చేశారు. తుఫాన్ నేపథ్యంలో బంగ్లాదేశ్‌లో 8 లక్షల మందికి పైగా ప్రజలను అక్కడి అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తుఫాను ప్రభావంతో ఒడిశా, బెంగాల్, ఈశాన్య రాష్ట్రాల్లో మంగళవారం వరకు అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. తెలుగు రాష్ట్రాలపై రీమల్ తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉంది. ఓ వైపు ఉష్ణోగ్రతలు ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే అంతలోనే వాతావరణం మారిపోతుంది. తెలంగాణలో గంటకు 50 కిలోమీటర్ల వేగంతో వీచే గాలులు బీభత్సం సృష్టించాయి. ఈదురుగాలుల ధాటికి ప్రజలు ప్రజలు చిగురుటాకులా వణికిపోయారు. తుఫాన్ ప్రభావంతో పలు జిల్లాల్లో 15 మంది వరకు చనిపోయారు. భారీగా భారీ ఆస్తి నష్టాన్ని మిగిల్చింది. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు కొమ్ముగుట్టలో వర్షం ధాటికి నిర్మాణంలో ఉన్న రేకుల షెడ్డు గోడ కూలిపోయింది. ఈ ఘటనలో గ్రామానికి చెందిన మల్లేష్ (38), అతని కుమార్తె అనూష (11), పెద్దకొత్తపల్లి మండలం ముష్టిపల్లికి చెందిన కూలీలు చెన్నమ్మ (37) రాములు(40) అక్కడికక్కడే మృతి చెందారు. మేడ్చల్ జిల్లా తిమ్మాయిపల్లిలో చెట్టుకొమ్మలు విరిగిపడి యాదాద్రి జిల్లా బొమ్మలరామారంనకు చెందిన నాగిరెడ్డి రామిరెడ్డి, ధనంజయ్య దుర్మరణం చెందారు. ములుగు మండలం క్షీరాసాగర్‌లో గోడ కూలి ఇద్దరు మరణించారు. ఈదురుగాలుల ధాటికి కోళ్లఫారం గోడ కూలడంతో గణపురం గ్రామానికి చెందిన గంగ గౌరీశంకర్ (30), చంద్రాయణగుట్టకు చెందిన భాగ్య(40) చుట్టాల వద్దకు వచ్చి మృత్యువాత పడ్డారు. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. నాగర్‌కర్నూల్ సమీపంలోని మంతటి చౌరస్తా దగ్గర షెడ్డుపై నుంచి సిమెంటు ఇటుకలు పడి వికారాబాద్ జిల్లా బషీర్‌బాద్ మండలం నల్లవెల్లి గ్రామానికి చెందిన వేణు (34) మృతి చెందాడు. అలాగే నాగర్ కర్నూల్ జిల్లాలో ఇద్దరు రైతులు మృత్యువాత పడ్డారు. బిజినేపల్లి మండలం నంది ఒడ్డెమాన్‌లో రైతు అంజన్‌రెడ్డి (49), తిమ్మాజీపేట మండలం మారేపల్లిలో రైతు కుమ్మరి వెంకటయ్య (55) పొలంలో పనిచేస్తుండగా పిడుగుపాటుకు గురయ్యారు. తెలకపల్లికి చెందిన దండు లక్ష్మణ్ (12) పిడుగుపాటుతో అక్కడికక్కడే మృతి చెందాడు.

హైదరాబాద్ శివారు హయత్‌నగర్, వనస్థలిపురం, బీఎన్‌రెడ్డి నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతాల్లో 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచాయి. వనస్థలిపురం గణేష్ ఆలయం రోడ్డులో భారీ చెట్టు కూలిపోవడంతో ట్రాఫిక్ జాం అయ్యింది. పలు కార్లు దెబ్బతిన్నాయి. హయత్‌నగర్-1 డిపోలో చెట్టు విరిగి పడడంతో బస్సు ధ్వంసమైంది. అర్ధరాత్రి వరకు విద్యుత్ లేక చాలా కాలనీల్లో జనం అల్లాడిపోయారు. రాయదుర్గం, గచ్చిబౌలి, టీఎన్‌జీవో కాలనీ, గౌరవెలి ప్రాంతాల్లో విద్యుత్ తీగలపై చెట్లు విరిగిపడ్డాయి. వర్షం ధాటికి ఐకియా, బయో డైవర్సిటీ, కొండాపూర్ సర్కిల్, గచ్చిబౌలి ఔటర్ సర్కిల్ ప్రాంతాల్లో ట్రాఫిక్ జాం ఏర్పడింది. రీమల్ తుఫాన్ దాటికి తెలంగాణలో వర్షాలు కురవగా ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోయారు. సోమ, మంగళవారాల్లో రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు ఎక్కువగా నమోదవుతాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. పలుచోట్ల వడగాడ్పులు వీచే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ హెచ్చరించారు. తీవ్ర తుఫాన్ ప్రభావంతో ఏపీలోని ప్రధాన ఓడరేవుల్లో ఆదివారం రెండవ నంబరు భద్రతా సూచిక ఎగురవేశారు. పలు జిల్లాల్లో వర్షాలు కురిశాయి. ఉప్పాడ బీచ్ రోడ్డు నుంచి కాకినాడ వెళ్లే వివిధ వాహనాల రాకపోకలను కొత్తపల్లి మండల పోలీసులు ఆపేశారు. గోర్స, పండూరు, పిఠాపురం మీదుగా కాకినాడ చేరుకోవాలని సూచించారు.

# 2వేల మంది సజీవసమాధి

ఎంగా ప్రావిన్స్: పాపువా న్యూగినీలో ఈ నెల 24న ఎంగా ప్రావిన్స్ లోని యంబాలి గ్రామంపై మౌంట్ ముంగాల కొండచరియలు విరిగిపడ్డాయి. తొలిరోజు సుమారు 100 మంది మరణించినట్లు అధికారులు చెప్పారు. కానీ.. ఆదివారానికి మృతుల సంఖ్య 670కి చేరినట్లు వెల్లడించారు. తాజాగా.. కొండచరియలు విరిగిపడిన ఘటనలో 2 వేల మంది సజీవ సమాధి అయినట్లు పాపువా న్యూగినియా దేశ జాతీయ విపత్తు సంస్థ పోర్ట్ మోరెస్బీలో ఉన్న ఐక్యరాజ్యసమితి కార్యాలయానికి తెలిపింది. సుమారు 200 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో కొండచరియలు విరిగిపడగా.. ఇళ్లు, పంటలు ధ్వంసమయ్యాయి. 8 మీటర్ల ఎత్తున శిథిలాలు కుప్పకూలాయి. కొండచరియలు విరిగిపడిన సమయంలో ప్రజలు నిద్రలో ఉండటంతో.. పెను ప్రమాదం నుంచి తప్పించుకోలేకపోయారు. భవనాలు కుప్పకూలాయి. ఈ విధ్వంసం ఆ దేశ ఆర్థిక జీవనరేఖపై పెను ప్రభావాన్ని చూపింది. అక్కడ పోర్గెరా మైన్ కి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా బ్లాక్ అయినట్లు అధికారులు వెల్లడించారు. అక్కడ రెస్క్యూ ఆపరేషన్ చేపట్టడం కూడా ప్రమాదకరంగా ఉందని చెప్పారు. ఘోర విపత్తును ఎదుర్కొన్న తమకు అందరూ సహాయ, సహకారాలు అందించాలని సైన్యం, ప్రజలను కోరింది ప్రభుత్వం. పాపువా న్యూ గినియాలో పరిస్థితి గురించి అంతర్జాతీయంగా అందరికీ తెలిసేలా చెప్పాలని, ఇది ఆదుకోవాల్సిన సమయమని పేర్కొంది.

# ఎన్నికల కౌటింగ్‌కు పక్కాగా ఏర్పాట్లు

హైదరాబాద్:ఓట్ల లెక్కింపునకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అన్ని రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. జూన్ 4న ఓట్ల లెకింపు ఏర్పాట్లపై ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీశ్ కుమార్ వ్యాస్ అన్ని రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులతో ప్రత్యేకంగా సమీక్షించారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యేవరకూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగా ల్, బీహార్ రాష్ట్రాల సీఈవోలు తమ రాష్ట్రా ల్లో తీసుకున్న చర్యలను వివరించారు. కౌం టింగ్‌కు సిద్ధంగా ఉన్నామని తెలంగాణ సీఈ వో వికాస్‌రాజ్ ఈ సందర్భంగా తెలిపారు. కౌంటింగ్ అధికారులకు
మొదటి రౌండ్ శిక్షణ మంగళవారం పూర్తవుతుందని వెల్లడించారు. ఈసీఐ ద్వారా 47 మంది పరిశీలకులను రాష్ట్రానికి పంపిస్తున్నట్టు డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ వ్యాస్ తెలియజేశారు.సమావేశంలో అదనపు సీఈవో డీఎస్ లోకేశ్‌కుమార్, జాయింట్ సీఈవో సర్ఫరాజ్ అహ్మద్, డిప్యూటీ సీఈవోలు పాల్గొన్నారు.

# ఇంత దారుణం తరవాత ఇప్పుడు చర్యలా

**గాంధీనగర్:** గుజరాత్‌లోని రాజ్‌కోట్ వీడియో గేమ్‌జోన్ అగ్ని ప్రమాద ఘటనలో 28 మంది ఆహుతైన విషయం దేశవ్యాప్తంగా తీవ్ర విషాదం నింపింది. అందులో చిన్నారులు ఉండటం, వారంతా గుర్తించలేనివిధంగా కాలిపోవడం తీవ్రంగా కలచివేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో స్థానిక మునిసిపల్ అధికారుల తీరుపై ఆ రాష్ట్ర హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. అమాయకుల ప్రాణాలు కోల్పోయిన తర్వాత చర్యలు చేపడతామని చెబుతోన్న రాష్ట్ర యంత్రాంగంపై తమకు విశ్వాసం లేదని పేర్కొంది.
అగ్నిప్రమాదం కేసుపై గుజరాత్ హైకోర్టు సోమవారం విచారణ చేపట్టింది. ఈసందర్భంగా రాజ్‌కోట్ మునిసిపల్ కార్పొరేషన్ అధికారులపై తీవ్ర స్థాయిలో మండిపడింది. 'మీ పరిధిలో ఇంతటి భవనం ఉందని మీకు తెలియదా? కళ్లు మూసుకున్నారా? ÷ర్ సేఫ్టీ లేకుండా రెండున్నరేళ్లుగా ఇది ఉందని ఎలా చెబుతారు. టికెట్ వసూలు చేసేటప్పుడు వినోద పన్ను గురించి తెలియదా?' అని జస్టిస్ బైరెన్ వైష్ణవ్, జస్టిస్ దేవాన్‌దేశాయ్‌లతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. ఆ భవనం ప్రారంభ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ కూడా పాల్గొన్నట్లు మీడియా కథనాలను చూపిస్తూ.. ఆ అధికారులు ఎవరు? వాళ్లంతా
ఆడుకోవడానికి అక్కడికి వెళ్లారా? అని ప్రశ్నించారు.ఆ గేమ్ జోన్ ఏర్పాటైనప్పటి (2021) నుంచి ఈ ప్రమాదం జరిగినంతవరకు రాజ్‌కోట్ కమిషనర్లుగా పనిచేసినవారంతా ఈ విషాదానికి బాధ్యత వహించాల్సిందేనని హైకోర్టు ధర్మాసనం స్పష్టంచేసింది. వారంతా వేర్వేరుగా అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించింది. అనుమతుల కోసం టీఆర్‌పీ గేమ్ జోన్ తమను సంప్రదించలేదంటూ ఆర్ఎంసీ తరఫు న్యాయవాది వివరించే సమయంలో హైకోర్టు ధర్మాసనం ఈ ఘాటు వ్యాఖ్యలు చేసింది.
ఈ దురదృష్టకర సంఘటన నేపథ్యంలో.. దీనికి ఓ వ్యక్తిని బాధ్యుడిని చేసేందుకు ప్రభుత్వం ముందుకురావాలని, అప్పుడే కఠిన చర్యలు తీసుకోవచ్చని తెలిపింది. పిటిషనర్ చేసిన విన్నపంపై ధర్మాసనం స్పందిస్తూ..' కఠిన చర్యలు ఎవరు తీసుకుంటారని ప్రశ్నించింది. రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగంపై మాకు నమ్మకం లేదు. మేం ఆదేశాలిచ్చిన నాలుగేళ్ల తర్వాత కూడా.. ఇలా జరగడం ఇది ఆరోసారి. ప్రాణాలు కోల్పోవడాన్నే వాళ్లు కోరుకుంటారు. ఆ తర్వాత యంత్రాంగాన్ని పురమాయిస్తారు. ÷ర్ సేఫ్టీకి సంబంధించి ఓ పిల్‌పై గతంలో ఇచ్చిన ఆదేశాలపై ఏం చేశారు. నెలలుగా కార్పొరేషన్ ఏం చేస్తోంది' అని హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది.

# ఎపిలోనూ ఎన్‌డిఎ పాలన ఏర్పాటు

**న్యూఢిల్లీ:** విభజన సందర్భంగా ఎపికి ఒనగూర్చే ప్రయోజనాల విషయంలో కేంద్రం ఓ రకంగా చేతులు ఎత్తేసిందనే చెప్పాలి. కానీ చాలానే చేశామని బిజెపి ప్రకటించుకుంది. పైగా విశాఖ ఉక్కును తెగనమ్మే ప్రయత్నం చేసింది. ఇలా చెప్పుకుంటూ పోతే బిజెపి వైఫల్యాలు అనేకం. పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్నా ఒక్కటంటే ఒక్క మేలు చేయలేదు. అయినా ఎపిలో గణనీయంగా సీట్లు గెల్చుకో బోతన్నట్లు కేంద్రహోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా వచ్చేది ఎన్డీయే సర్కారేనని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన పార్టీలతో కలిసి భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తుందని సంపూర్ణ ధీమా వ్యక్తం చేశారు. ఏపీలో తాము దాదాపు 17 లోక్‌సభ స్థానాలను గెల్చుకుంటామనీ విశ్వాసం వ్యక్తం చేశారు. సార్వత్రిక సమరంలో దేశవ్యాప్తంగా 400కుపైగా సీట్లు సాధిస్తామన్నారు. దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణకు సమయం వచ్చేసిందని షా అన్నారు. వాటితో ఎన్నికల వ్యయం దిగివస్తుందని పేర్కొన్నారు. మండే ఎండల్లో కాకుండా, మరేదైనా సమయంలో సార్వత్రిక ఎన్నికలను నిర్వహించడంపై కూడా దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు. ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్‌లలోనూ ఈ దఫా కమలదళం ప్రభుత్వాలను ఏర్పాటుచేస్తుందని జోస్యం చెప్పారు. ఓ ప్రముఖ వార్తాసంస్థతో ఆయన పలు అంశాలపై మాట్లాడుతూ ఎపిలో ఎన్‌డిఎ అధికారంలోకి వస్తుతందని అన్నారు. ఈసారి అధికారంలోకి వచ్చాక.. ఐదేళ్ల కాలంలో విస్తృత సంప్రదింపుల అనంతరం దేశవ్యాప్తంగా ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని తాము అమలు చేయనున్నట్లు షా చెప్పారు. భాజపా అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనే కాకుండా, విపక్ష పార్టీల పాలనలోని రాష్ట్రాల్లోనూ ఈ దఫా తమకు మెరుగైన ఫలితాలు వస్తాయని షా ధీమాగా పేర్కొన్నారు. 147 సీట్లున్న ఒడిశా అసెంబ్లీలో కమలదళం 75 స్థానాలు గెల్చుకుంటుందని అంచనా వేశారు. ఆ రాష్ట్రంలో 16-17 ఎంపీ సీట్లను తమ ఖాతాలో వేసుకుంటామని జోస్యం చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో 17, పశ్చిమ బెంగాల్‌లో 24-32 లోక్‌సభ స్థానాలు ఎన్డీయేకు దక్కుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. యూసీసీని అమల్లోకి తీసుకురావాల్సిన బాధ్యతను రాజ్యాంగ నిర్మాతలు పార్లమెంటు, రాష్ట్ర శాసనసభల భుజస్కంధాలపై ఉంచారని షా పేర్కొన్నారు. రాజ్యాంగ పరిషత్ నిర్దేశిరచిన మూలసూత్రాల్లో యూసీసీ కూడా ఉందని చెప్పారు. తమ సర్కారు మూడోసారి అధికారంలోకి వచ్చాక.. అన్ని వర్గాలతో సంప్రదింపులు జరిపి వచ్చే ఐదేళ్లలో దాన్ని అమల్లోకి తీసుకొస్తుందని స్పష్టం చేశారు. సాయుధ బలగాల్లో నియామకం కోసం మోదీ సర్కారు తీసుకొచ్చిన అగ్నిపథ్ పథకంపై విపక్షాలు విమర్శలు గుప్పిస్తుండటాన్ని షా తప్పుబట్టారు. అగ్నిపథ్ కంటే ఆకర్షణీయ పథకం యువతకు ఇంకొకటి ఉండదన్నారు. నాలుగేళ్ల సర్వీసు అనంతరం పదవీవిరమణ పొందే అగ్నివీర్‌లకు రిజర్వేషన్ కారణంగా కేంద్ర సాయుధ పోలీసు దళాల్లో ఉద్యోగావకాశాలు 7.5 రెట్లు అధికంగా ఉంటాయని తెలిపారు. అగ్నిపథ్‌ను సరిగా అర్థం చేసుకోకుండా.. దాన్ని రద్దు చేస్తామని హామీ ఇస్తున్న రాహుల్‌గాంధీని చూస్తుంటే జాలేస్తోందన్నారు. ఏకీకృత వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) విధానాన్ని తీసుకొస్తామంటూ కాంగ్రెస్ హామీ ఇస్తోందని షా తెలిపారు. ధనవంతులు ఉపయోగించే విలాస వస్తువులపై, పేదలు వాడే సరకులపై ఒకే పన్ను రేటును అమల్లోకి తీసుకురావడం ఎలా సముచితమని ప్రశ్నించారు.
సార్వత్రిక ఎన్నికల్లో తామేమీ మతం ఆధారిత ప్రచారం చేయడం లేదని షా స్పష్టం చేశారు. ఒకవేళ ముస్లిం రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మాట్లాడటం, ఆర్టికల్-370 రద్దును చూపుతూ ఓట్లు అడగడం, యూసీసీని అమలు చేస్తామని చెప్పడం మతం ఆధారిత ప్రచార కార్యకలాపాలే అయితే.. భాజపా అలాంటి ప్రచారం చేసిందని, ఇకముందూ కొనసాగిస్తుందని స్పష్టంచేశారు. ఈవీఎంలు, పోల్ డేటాకు సంబంధించి ఈసీపై విపక్షాలు విమర్శలు గుప్పిస్తుండటాన్ని షా తప్పుబట్టారు. భాజపా ఓడిపోయిన తెలంగాణ, కర్నాటక హిమాచల్‌ప్రదేశ్, పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాల్లోనూ ఇప్పుడు అనుసరించిన విధానాలనే ఈసీ అనుసరించిన సంగతిని గుర్తుచేశారు. ఓటమిని ముందుగానే గ్రహించి.. రాహుల్ వైఫల్యాన్ని కప్పిపుచ్చేందుకే పోలింగ్ విధానంపై కాంగ్రెస్ ప్రశ్నలు లేవనెత్తుతోందంటూ ఎద్దేవా చేశారు.
దేశంలో నక్సలిజం సమస్య అంతమవుతుందని షా ఉద్ఘాటించారు. ఛత్తీస్‌గఢ్‌లోని కొన్ని ప్రాంతాల్లో తప్ప మరెక్కడా మావోయిస్టులు లేరని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లో ఈసారి వేర్పాటువాదులు కూడా అత్యధికంగా ఓటింగ్‌లో పాల్గొన్నారని షా అన్నారు. అక్కడ పోలింగ్ ప్రశాంతంగా ముగియడం మోదీ ప్రభుత్వం సాధించిన విధానపరమైన విజయమని పేర్కొన్నారు.

# జగన్ సర్కార్‌పై నిరుద్యోగల స్పందన

**అమరావతి:** మరో నాలుగౌఐదు రోజుల్లో..అంటే జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. ఈ ఎన్నికలు జగన్ సమర్థతకు పరీక్ష కాబోతున్నాయి. సిఎంగా యాన 99శాతం పనులు లేదా హామీలు పూర్తి చేశానిన ప్రకటించారు. పనులు లేదా హామీలంటే నేరుగా డబ్బులు వేయడం అన్నది ఆయన నిఘంటువు అర్థం. డబ్బులు వేయడమే పాలన అయితే అందుకు సిఎంలు అవసరం లేదు. ప్రభుత్వం కూడా అసవరం లేదు. గత ఐదేళ్లో రాష్ట్రం పూర్తిగా దివాళా తసింది. 7లక్షల కోట్లకు పైగానే అప్పులు చేసినట్లు తేలింది. నేరుగా ప్రజల ఖాతాల్లో డబ్బులు వేసేందుకు రాష్ట్రాన్ని అప్పులకుప్పగా చేశారు. మటట్ఇ, ఇసుక, మద్యం, గంజాయి వ్యాపారాలు బాగుపడ్డాయి. అడ్డగోలుగా రాష్ట్రంపై మాఫియా దండెత్తింది. నిలదీసిన వారిని నిలువునా చీల్చారు. ఉద్యోగాల కల్పన జరగలేదు. రాజధాని లేకుండా పోయింది. పోలవరం పడకేసింది. ఒక్కటంటే ఒక్క అభివృద్ధి పని జరగలేదు. అయితే దీనిని ప్రజలు ఎలా స్వీకరించారన్నది తేలనుంది. ఇదే అభివృద్ధి అనుకుంటే ప్రజలు జగన్‌కు బ్రహ్మరథం పట్టివుంటారు. కాదనుకుంటే ఓటర్లు మరో రకంగా స్పందించది ఉంటారు. ఇదంతా మరో ఐదు రోజుల్లో తేలనుంది. ఎన్నికల ముందు డీస్సీ వంటి ఉద్యోగాల ప్రకటన చేసినా అది కార్యరూపం దాల్చలేదు. ఐదేళ్లుగా కాలయాపన చేసి ఇప్పుడు ప్రకటించడం, అది కోర్టుల్లో నలిగి వాయిదా పడడం వంటివి జగన్ అసమర్థతకు నిర్శనంగా చూడాలి.



# బీడీ కార్మికులకు పెరిగిన వేతనం అమలు చేయాలి.

## - బీడీ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు వై.ఓమయ్య.




**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మే 27:**

బీడీ కార్మికులకు పెరిగిన వేతనం అమలు చేయాలని తెలంగాణ బీడీ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు వై.ఓమయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర బీడీస వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విలేఖర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీడీ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు వై.ఓమయ్య మాట్లాడుతూ, బీడీ కార్మికుల ప్యాకర్ల నెలసరి ఉద్యోగుల నూతన వేతనాలు బీడీ కార్మిక సంఘాల పోరాటంతో యాజమాన్యాలు పెంచడం జరిగిందన్నారు. బీడీ కార్మికులకు వెయ్యి బీడీలకు నాలుగు రూపాయల 25 పైసలు, పాకర్లకు 3650, నెలసరి ఉద్యోగులకు ( బట్టి వాల)1700 ప్రస్తుత ఇస్తున్న వేతనంపై పెంచుకోవడం జరిగిందని అన్నారు. పోరాడి వేతనాలు పెంచుకున్న కార్మికులకు ఏఐటియుసి తరఫున శుభాకాంక్షలు తెలిపారు. పెంచిన వేతనం మే ఒకటవ తేదీ నుంచి అమలు చేయాలని లేనియెడల ఆందోళన చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్కానింగ్ సెంటర్‌ను మూసివేయాలి

**సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు వి. ప్రభాకర్ డిమాండ్.**

**జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతుకు వినతి పత్రం.**



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మే 27:**

వైద్యం కోసం వచ్చిన మహిళాల అసభ్య ఫొటోస్, వీడియోలు చిత్రికరించి వారి ఆత్మఅభిమానం దెబ్బతీసిన అయ్యప్ప స్కానింగ్ సెంటర్ ను మూసివేయాలి అని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. ప్రభాకర్ డిమాండ్ చేశారు.

ఈ మేరకు సోమవారం సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతుకు డిమాండ్స్ తో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ, వైద్యకోసం వచ్చిన మహిళాలను అసభ్యకరంగా ఫొటోస్, వీడియో స్ తీసి బ్లాక్ మెయిల్ చేయడం మహిళాలను మానసికంగా వేదించడం సిగ్గుచేటు అన్నారు. నిజామాబాద్, ఆర్మూర్, బాన్స్ వాడ, భోధన్, కామారెడ్డి నగరాల్లో స్కానింగ్ సెంటర్స్ పేరట ప్రజల్ని నిలువుదోపిడీ చేస్తున్నాయి అన్నారు. ఎలాంటి శిక్షణ, ట్రైనింగ్ లేని వారిని టెక్నీషియన్స్ గా, సిబ్బందిగా పెట్టుకొని మహిళాలను వ్యక్తిగత గొప్యకు భంగం కలిగించే విధంగా వ్యవహారిస్తున్నాయని అన్నారు. డాక్టర్స్ లాభపేక్షతోని వైద్యాన్ని వ్యాపారం చేసి ప్రజల్ని నిలువు దోపిడీ చేస్తున్నారని అన్నారు. స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ చేయకూడదని చట్టం ఉన్న ఎక్కడ కూడా పట్టించుకోవడంలేదని, డబ్బులు తీసుకొని మరి లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నారన్నారు. వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తే డబ్బులు దండుకోవడమే కాకుండా మహిళల ఆత్మ అభిమానాన్ని దెబ్బతిస్తున్నారన్నారు. అనేక ప్రభుత్వ ఆసుపత్రులలో సర్టిఫైడ్ డాక్టర్స్ లేకున్నా డబ్బున్న వారు ఆస్పత్రులను నిర్వహిస్తూ, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. స్కానింగ్ సెంటర్స్ అన్నీ కూడా అక్రమంగా, అన్యాయంగా దోపిడీకి పాల్పడుతున్నాయని అన్నారు. అన్ని సెంటర్స్ పై ప్రభుత్వం నిఘా పెంచి అక్రమ స్కానింగ్ సెంటర్స్ పై చట్టబద్ధ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఎంఐఎం పార్టీ కూడా అయ్యప్ప స్కానింగ్ సెంటర్ కు వత్తాసుగా వకల్తా పుచ్చుకొని మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు. అయ్యప్ప స్కానింగ్ సెంటర్ పై చర్య తీసుకుని మూసివేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాస్ లైన్ రాష్ట్ర నాయకులు రామకృష్ణ, దేవారం, ఆర్మూర్ డివిజన్ సాయి కార్యదర్శి ఆర్. రమేష్, నాయకులు కిషన్, ఆర్. దామోదర్, కిషన్, అశోక్ అనిస్ లు పాల్గొన్నారు.



# ప్రతిపక్షాల కట్టడికే ఫోన్ ట్యాపింగ్

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి పలు సంచలన అంశాలు వెల్లడయ్యాయి. ఎందుకు ట్యాపింగ్ చేయాల్సి వచ్చింది? అందుకు అనుసరించిన వ్యూహమేంటి? ఎలా అమలు చేశారు వంటి వివరాలు బయటపడ్డాయి. ఈ కేసులో అరెస్టయిన టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు ఈ విషయాలను దర్యాప్తు అధికారులకు ఇచ్చిన వాంగ్మూలంలో స్వయంగా వెల్లడించారు. వివరాలు ఇలా.. “కొద్దిపాటి విమర్శ వచ్చినా కేసీఆర్ చిరాకుపడేవారు. ప్రతిపక్ష నాయకులను ఎప్పటికప్పుడు గమనించేందుకు ఎస్ఐబీ డీఎస్పీ ప్రణీత్‌రావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఎస్ఐబీ ఐజీ ప్రభాకర్‌రావు ఏర్పాటు చేసిన తర్వాత నేను కూడా ఆయనతో కలిసి పనిచేయడం మొదలుపెట్టా. వివిధ పార్టీల నాయకుల ఫోన్లను పర్యవేక్షించడం ద్వారా సేకరించిన సమాచారాన్ని ప్రణీత్‌రావు నాకు పంపేవారు. కొన్ని సందర్భాల్లో ఇలాంటి సమాచారాన్ని పోలీసు కమిషనర్‌కు పంపాలని ప్రణీత్‌రావుకు చెప్పేవాడిని. కమిషనర్ ఆదేశాల ప్రకారమే టాస్క్‌ఫోర్స్ పనిచేస్తోందని నమ్మించేందుకే ఇలా చేసేవాళ్లం. ప్రతిపక్షాలకు చెందిన డబ్బు పట్టుకోవడం, భారాస అవసరాల కోసం అందుతున్న డబ్బు సజావుగా రవాణా అయ్యేలా చూడటంలో ప్రణీత్‌రావుతో కలిసి పనిచేయాలని ప్రభాకర్‌రావు నన్ను ఆదేశించారు. 2018 అసెంబ్లీ ఎన్నికలకు ముందు మొదలైన ఈ పని.. 2019 లోక్‌సభ ఎన్నికలు, ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికలు, 2023 ఎన్నికల్లోనూ కొనసాగింది. 2020లో పదవీ విరమణ చేసిన తర్వాత కేసీఆర్ ఆశీస్సులతో ప్రభాకర్‌రావు మళ్లీ ఎస్ఐబీ అధినేతగా నియమితులయ్యారు. కొంతకాలం నిఘా విభాగాధిపతిగానూ పనిచేశారు.

భారాస నాయకుల ఫోన్లూ...

రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల్లో జరుగుతున్న రాజకీయ పరిణామాల గురించి, భారాసకు, ఆ పార్టీ నేతలకు ముప్పుగా భావించే నాయకులకు సంబంధించిన సమాచారం సేకరణపై ప్రభాకర్‌రావు నాతో తరచూ చర్చించేవారు. ఈ విషయాలను ప్రణీత్‌రావుతోనూ ఎప్పటికప్పుడు పంచుకునేవారు. వీటి ఆధారంగా ప్రణీత్‌రావు ఆయా నాయకులను పర్యవేక్షిస్తూ (ఫోన్‌ట్యాపింగ్) ఉండేవారు. వీరిలో అనేకమంది భారాస నాయకులు సైతం ఉన్నట్లు నాకు తెలిసింది. అప్పటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, టి.రాజయ్య, పట్నం మహేందర్‌రెడ్డి, ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్, ఈటల రాజేందర్, బండి సంజయ్, జానారెడ్డి కుమారుడు రఘువీర్ తదితరులు ఇందులో ఉన్నారు. వ్యాపారులు, స్థిరాస్తి సంస్థల వారినీ పర్యవేక్షించారు.

భాజపాకు బ్రేక్ వేయాలని

దుబ్బాక, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో భాజపా విజయాలు సాధించిన తర్వాత ఆ పార్టీకి బ్రేక్ వేయాలన్న ఉద్దేశంతో మునుగోడు ఉప ఎన్నికను కేసీఆర్ చాలా ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. భాజపాలో పెద్దలుగా చెప్పుకొంటున్న కొందరు తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిని తమ పార్టీలో చేరాలని ప్రలోభపెడుతున్నట్లు 2022 అక్టోబరు చివర్లో ఆయనకు తెలిసింది. మరికొందరు భారాస ఎమ్మెల్యేలనూ తనతోపాటు తేవాలని రోహిత్‌రెడ్డిపై ఒత్తిడి తెచ్చినట్లు కూడా సమాచారం అందింది. దీని ఆధారంగా భాజపాను ఇరుకునపెట్టాలని కేసీఆర్ భావించారు. ఇందుకు బాధ్యులైన వారందర్నీ పర్యవేక్షించాలన్న ఆయన ఆదేశాలకు అనుగుణంగా ప్రణీత్‌రావు ఈ బాధ్యతలు చేపట్టారు. కొందరి ఫోన్లు ట్యాప్ చేసి, వారి సంభాషణలకు సంబంధించిన ఒక ఆడియో క్లిప్ రూపొందించి కేసీఆర్‌కు ఇచ్చారు. దాని ఆధారంగా వ్యూహం పన్నారు. ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టిన నందుతోపాటు ఇద్దరు స్వామీజీలను మొయినాబాద్ దగ్గర్లోని అజీజ్‌నగర్‌లో ఉన్న ఒక ఫామ్‌హౌస్‌కు రప్పించారు. ఈ పనికోసమే నేను టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీనాథ్‌రెడ్డి, ఎస్సై శ్రీకాంత్‌లను దిల్లీ పంపించి స్పై కెమెరాలను తెప్పించాను. వాటిని టాస్క్‌ఫోర్స్ అధికారులు అశోక్‌రెడ్డి, మల్లికార్జున్, శ్రీకాంత్‌లు ఫామ్‌హౌస్‌లో అమర్చారు. వేర్వేరు సామాజికవర్గాలకు చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలను ఈ ఆపరేషన్‌లో పాల్గొనాలని పెద్దాయన(కేసీఆర్) ఆదేశించారు. అనుకున్నట్లుగానే ఆపరేషన్ పూర్తయింది. సైబరాబాద్ ఎస్‌వోటీ తదుపరి చర్యలు తీసుకొంది. అనంతరం సిట్ ఏర్పాటు చేశారు. భాజపా జాతీయ నాయకుడు బి.ఎల్.సంతోష్‌ను అరెస్టు చేసి, తద్వారా ఈడీ కేసులో తన కుమార్తె కవితను ఇబ్బందిపెడుతున్న ఆ పార్టీని తమతో సయోధ్యకు వచ్చేలా చేయాలన్నదే కేసీఆర్ లక్ష్యం. అయితే కొంతమంది సైబరాబాద్ పోలీసుల అసమర్థత వల్ల కేరళలోని మాతా అమృతానందమయి సంస్థలోని కీలక వ్యక్తి ఒకరు తప్పించుకొని పారిపోయారు. ఎస్పీ రెమా రాజేశ్వరి, ఎస్ఐబీ సీఐ గట్టు రాజమల్లు హుటాహుటిన ప్రత్యేక విమానంలో కేరళ వెళ్లినప్పటికీ ఫలితం లేకపోయింది. ఆ తర్వాత బీఎల్ సంతోష్‌ను అరెస్టు చేయవద్దని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతోపాటు కేసు సిట్ నుంచి సీబీఐకి బదిలీ అయింది. అనుకున్నట్లు పని పూర్తికాకపోవడంతో కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

మునుగోడు ఉపఎన్నిక సందర్భంగా..

మునుగోడు ఉప ఎన్నిక సమయంలో భాజపా అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల డబ్బు స్వాధీనం చేసుకోవాలని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఆదేశాలు అందాయి. పేర్లు, వారి ఫోన్ నంబర్లు పోలీసు కమిషనర్ ద్వారా నాకు అందేవి. వారి ఫోన్లు ట్యాప్ చేసి.. సమాచారం సేకరించేందుకు ప్రణీత్‌రావు సాయం తీసుకునేవాడిని.



# కౌంటింగ్ లో చిన్న పొరపాటు ఉండొద్దు.

**కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు.**

**సీ.పీ తో కలిసి కౌంటింగ్ సెంటర్ పరిశీలన.**

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, మే 27 :**



నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో పోలైన ఓట్ల లెక్కింపు కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేశామని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. డిచ్పల్లి లోని సీఎంసీ కళాశాలలో కొనసాగనున్న ఓట్ల లెక్కింపును పురస్కరించుకుని కలెక్టర్ సోమవారం పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ తో కలిసి కౌంటింగ్ సెంటర్ ను పరిశీలించారు. పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని ఆయా అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా కౌంటింగ్ కోసం చేసిన ఏర్పాట్లను నిశితంగా పరిశీలన జరిపారు. కౌంటింగ్ హాళ్లలో ఏర్పాటు చేసిన టేబుళ్లు, బారికేడ్లు, సిసి కెమెరాలు, స్ట్రాంగ్ రూంల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఏ చిన్న తప్పిదానికి సైతం తావులేకుండా కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా అప్రమత్తతో విధులు నిర్వర్తించాలని సూచించారు.

కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరందు, సహాయ రిటర్నింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

# “బీడి” ప్యాకర్ల సంబరాలు.



**సమస్యలపై ఐక్యంగా పోరాడాలి.**

**తెలంగాణ బహుళజన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు యస్. సిద్దిరాములు పిలుపు.**




**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మే 27:**

బీడి పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు పెంపుతో తెలంగాణ బహుళజన బీడీ కార్మిక సంఘం (బిఎల్ టియు)పిలుపుతో సోమవారం పలు సెంటర్లలో ప్యాకర్లు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు.

నిజామాబాదు జిల్లాల్లోని ముబారక్ నగర్ దేశాయి బీడీ సెంటర్ లో బీడీ ప్యాకర్స్, బట్టి, చటన్ కార్మికులు తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం (బిఎల్ టీయూ) రాష్ట్ర అధ్యక్షులు యస్. సిద్దిరాములును ఘనంగా సన్మానించారు. అలాగే నందిపేట్ మండల కేంద్రం లో దేశాయి బీడీ సెంటర్, శివసాగర్ బీడీ సెంటర్, నవి పేట మదలోని జెన్నపల్లి శివసాగర్ బీడీ సెంటర్, సాబ్లే వాఘ్రే సెంటర్, మొస్రా మండలం కేంద్రం లో దేశాయి బీడీ సెంటర్ లలో ప్యాకర్లు సిద్దీరాములును సన్మానించారు. ఈ సందర్భంగా సిద్దిరాములు మాట్లాడుతూ, కార్మికులు ఐక్యంగా ఉండటం వల్లే యాజమాన్యం దిగి వచ్చి వేతనాలు పెంచడం జరిగిందన్నారు. బీడీ కార్మికులకు వెయ్యి బీడీలకు ప్రస్తుతం ఉన్న వేతనం పై రూ”4-25 పైసలు, బీడీ ప్యాకర్లకు ఉన్న వేతనం పై నెలకు రూ”3650, బట్టి, చటన్, నెలసరి ఉద్యోగుల కు రూ”1700 యాజమాన్యం పెంచడం జరిగిందన్నారు. కార్మికులు ప్రతి సమస్యపై ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపనిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బహుళ జనబీడీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సయ్యద్ తో పాటు ఆయా సెంటర్ల ప్యాకర్లు పాల్గొన్నారు.

## కామారెడ్డిలో....

కామారెడ్డి జిల్లాలోని వివిధ బీడి సెంటర్లలో తెలంగాణ బహుళ జనబీడీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు తో పాటు ఆయా కంపెనీ సెంటర్ల ప్యాకర్లు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

# పిఎఫ్ అధికారులపై చర్యలు తీసుకోవాలి.




**బిఎల్ టియు రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ డిమాండ్.**

**పిఎఫ్ కార్యాలయం వద్ద ధర్నా.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మే 27**

వివిధ రంగాల కార్మికులకు పిఎఫ్ అమౌంట్ చెల్లింపుల్లో నిర్లక్ష్యం, అవినీతికి పాల్పడుతున్న పిఎఫ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని బిఎల్ టియు రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని పిఎఫ్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దండి వెంకట్ మాట్లాడుతూ, జిల్లాలోని మున్సిపల్, బీడీ, ఇతర పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు రిటైర్మెంట్ అయినవారికి, మృతి చెందిన వారికి రావాల్సిన పిఎఫ్, ఇన్సూరెన్స్ డబ్బులు కోట్లాది రూపాయలు కార్మికుల బ్యాంక్ ఖాతాలకు జమచేయడంలో పీఎఫ్ కార్యాలయం అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. సంవత్సరాల తరబడి కార్మికులను తమ కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వేదింపులు తట్టుకోలేని కార్మికులు పిఎఫ్ కార్యాలయంలో కొంత మంది సిబ్బందితో 20, 30 శాతం పర్సంటేజ్ ఇస్తే పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. వారంరోజుల్లో పిఎఫ్, ఇన్సూరెన్స్ డబ్బులు కార్మికుల ఖాతాల్లో జమచేకపోతే పిఎఫ్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు.

అదేవిధంగా ఎల్లారెడ్డి, ఆర్మూర్ మున్సిపల్ కార్మికులకు గత రెండు సంవత్సరాలుగా పిఎఫ్, ఇన్సూరెన్స్ డబ్బులు కార్మికుల ఖాతాల్లో జమ చేయడం లేదని వెంటనే జమచేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన లెఫ్ట్ మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత, బిఎల్ టియు జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్, మున్సిపల్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు నవీన్, ఎం. ఎల్లయ్య, నగర నాయకులు కె. సహాదేవ్, ఎల్లారెడ్డి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి మల్లేష్, ఆర్మూర్ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రాజేశ్వర్ లతోపాటు నిజామాబాద్, ఆర్మూర్, ఎల్లారెడ్డి మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

